ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలు సాధించిన చెస్ ప్లేయర్లను బుధవారం న్యూఢిల్లీలో అభినందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ. ఈ సందర్భంగా అర్జున్, ప్రజ్ఞానంద మధ్య చెస్ పోరును మోదీ ఆస్వాదించారు.

ఒలింపియాడ్ విజేతలకు భారీ నజరానా

రూ.3.2 కోట్లు ప్రకటించిన ఏఐసీఎఫ్

ఢిల్లీ: నాలుగు రోజుల క్రితం బుడాపెస్ట్ (హంగేరి) వేదికగా ముగిసిన ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు గెలిచిన భారత బృందానికి ఆలిండియా చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) రూ.3.2 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. 97 ఏండ్ల చెస్ ఒలింపియాడ్ చరిత్రలో చారిత్రక విజయం సాధించిన భారత చదరంగ వీరులకు సన్మానం సందర్భంగా ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ నగదు బహుమతి ప్రకటన చేశారు. ఆటగాళ్లకు రూ. 25 లక్షలు, పురుషుల, మహిళల జట్టు కోచ్‌లు అయిన అభిజిత్ కుంటే, శ్రీనాథ్ నారాయణన్‌కు తలా రూ.15 లక్షలు పంచనుండగా భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన దివ్యేందు బరువకు రూ.10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లలో ఒక్కొక్కరికి రూ. 7.5 లక్షలు అందనున్నాయి. ఈ సందర్భంగా నితిన్ నారంగ్ మాట్లాడుతూ.. 'చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణాలు నెగ్గాలన్న మన కోరిక నెరవేరింది. కానీ ఈ విజయయాత్ర మాత్రం కొనసాగుతుంది' అని అన్నారు.

అందరూ అడుగుతున్నారనే..

ట్రోలర్స్‌కు మను భాకర్ స్ట్రాంగ్ కౌంటర్

ఢిల్లీ: ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా షూటింగ్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన యువ షూటర్ మను భాకర్ సోషల్ మీడియాలో తనపై వస్తున్న ట్రోలింగ్‌కు ఘాటుగా స్పందించింది. స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన మను.. ఏదైనా కార్యక్రమాలకు వెళ్లినప్పుడు తనకు వచ్చిన రెండు పతకాలను చూపించడంపై సోషల్ మీడియాలో పలువురు దీనిని తప్పుబడుతున్నారు. దీనిపై మను ఓ జాతీయ చానెల్‌తో మాట్లాడుతూ.. 'నేను తీసుకెళ్తా! ఎందుకు తీసుకెళ్లకూడదు? ఆ పతకాలను చూడాలని అందరికీ ఆసక్తిగా ఉంటుంది. నన్ను కార్యక్రమాలకు ఆహ్వానించే నిర్వాహకులు సైతం వాటిని తీసుకురావాలని అడుగుతున్నారు. నేను వాటిని తీసుకెళ్లినప్పుడు అక్కడ వాళ్లు ఫొటోలు తీసుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు' అని తెలిపింది. ఇదే విషయమై ఆమె ఎక్స్‌లో స్పందిస్తూ.. 'నేను సాధించిన ఈ పతకాలు దేశానికి చెందినవి. వీటిని ధరిస్తున్నందుకు నేను గర్విస్తున్నా' అని రాసుకొచ్చింది.

మెరిసిన శ్రీకాంత్

మకావు: సుమారు నాలుగు నెలల విరామం తర్వాత రాకెట్ పట్టిన భారత స్టార్ షట్లర్ శ్రీకాంత్ మకావు ఓపెన్‌లో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్.. 21-14, 21-15తో డేనిల్ డుబొవెంకో (ఇజ్రాయెల్)ను వరుస సెట్లలో చిత్తు చేసి రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు. రెండో రౌండ్‌లో అతడు భారత్‌కే చెందిన అయూష్‌తో తలపడనున్నాడు.

వినేశ్‌కు నాడా నోటీసులు

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) బుధవారం నోటీసులు జారీ చేసింది. తాను ఎక్కడ ఉంటుందన్న విషయంలో సరైన స్పష్టత లేని కారణంగా నోటీసులు ఇచ్చిన నాడా 14రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది. నాడాకు చెందిన ప్రత్యేక టూల్‌లో ప్లేయర్లు తమ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయంలో వినేశ్ విఫలం నోటీసులకు దారితీసింది.

వరల్డ్ స్నూకర్ చాంప్ కమల్

ఉలన్‌బాతర్(మంగోలియా): ప్రతిష్ఠాత్మక ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత వెటరన్ క్యూయిస్టు కమల్ చావ్లా విజేతగా నిలిచాడు. బుధవారం జరిగిన ఫైనల్లో కమల్ 6-2 తేడాతో అస్జద్ ఇక్బాల్(పాకిస్థాన్)పై అద్భుత విజయం సాధించాడు. 2017లో ఇదే టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన 45 ఏండ్ల చావ్లా తొలిసారి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన తుదిపోరులో కమల్..తొలుత రెండు ఫ్రేములు చేజార్చుకున్నా పుంజుకుని విజయం సాధించాడు. ఇదే టోర్నీలో మల్కీత్ సింగ్ విద్యాపిళ్లై, కీర్తన పాండియాన్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

ఇంగ్లండ్ సిరీస్ ఆశలు సజీవం

చెస్టర్ లీ స్ట్రీట్: స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం ముగిసిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 46 పరుగుల తేడాతో గెలిచింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఇంగ్లండ్ విజేతగా నిలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. అలెక్స్ కేరీ (77), స్టీవ్ స్మిత్ (60) రాణించారు. అనంతరం ఇంగ్లండ్ 37.4 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఇంగ్లండ్ సారథి హ్యారీ బ్రూక్ (110 నాటౌట్), విల్ జాక్స్ (84) అదరగొట్టారు. వర్షం వచ్చే సమయానికి ఇంగ్లండ్ సాధించాల్సిన దానికంటే 46 పరుగులు ఎక్కువగా ఉండటంతో మ్యాచ్ ఆ జట్టు వశమైంది. సిరీస్‌లో నాలుగో వన్డే ఈనెల 27న లండన్ వేదికగా జరుగనుంది.

మౌంట్ గోరిచెన్‌పై యశ్వంత్

సత్తాచాటిన మానుకోట యువకుడు

మరిపెడ, సెప్టెంబర్ 25: తెలంగాణ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ మరోమారు సత్తాచాటాడు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని చేతల్లో చూపెడుతూ మరోమారు పర్వతంపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించాడు. తాజాగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రతిష్ఠాత్మక మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ అధిరోహించాడు. ఇప్పటికే యువ పర్వతారోహకుడిగా గుర్తింపు సాధించిన యశ్వంత్.. గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సాధించాడు. ఈ పర్వతారోహణను ఈనెల 4న ప్రారంభించి 19 తేదీ వరకు పూర్తి చేసాడు. గతంలో ఈ కుర్రాడు.. దక్షిణాఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో, యూరప్‌కు చెందిన మౌంట్ ఎల్‌బ్రస్ తదితర పర్వతాలు ఎక్కాడు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా యశ్వంత్ ధీమా వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే బుధవారం అసోం రాజ్‌భవన్‌లో గవర్నర్ లక్ష్మణప్రసాద్ ఆచార్యను యశ్వంత్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే అందించాడు. భవిష్యత్‌లోనూ ఇలానే మరిన్ని పర్వతాలు అధిరోహించాలని గవర్నర్ ఆకాంక్షించినట్లు తెలిపాడు.

బ్యాటర్లకు పండగేనా?

చెన్నై పిచ్‌కు భిన్నంగా కాన్పూర్

ఐదు రోజులు సాగుతుందన్న క్యూరేటర్ • ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య శుక్రవారం నుంచి కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ స్టేడియం వేదికగా మొదలుకాబోయే టెస్టు తొలి మ్యాచ్‌కు పూర్తి భిన్నంగా సాగనుందా? గతంలో ఎప్పుడూ చూడని విధంగా పేసర్లకు అనుకూలించిన చెపాక్ లాగా కాన్పూర్ పిచ్ ఉండనుందా? అంటే అవుననే అంటున్నాడు పిచ్ క్యూరేటర్ శివ్ కుమార్. కాన్పూర్‌లో సంప్రదాయ నల్లమట్టి పిచ్ బ్యాటర్లతో పాటు స్పిన్నర్లకూ స్వర్గధామంగా ఉంటుందని, ఇక్కడ ఐదు రోజులు మ్యాచ్ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. కాన్పూర్‌కు సమీపంలో ఉన్నావో పట్టణానికి ఆనుకుని ఉన్న కాళీమిట్టి చెరువు నుంచి తీసిన మట్టితో పిచ్‌ను రూపొందించినట్టు ఆయన తెలిపాడు. ఆట ఆరంభమయ్యాక రెండు సెషన్ల పాటు బంతి సీమర్లకు అనుకూలిస్తుందని, కానీ ఆ తర్వాత బ్యాటర్లు కుదురుకుంటే భారీ స్కోర్లు చేయొచ్చునని అంచనా వేశాడు. ఇక చివరి మూడు రోజులలో స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంటుందని చెప్పాడు.

ప్రాక్టీస్ ప్రాక్టీస్

రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చెన్నై టెస్టు గెలిచి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సంపాదించిన భారత్.. కాన్పూర్‌లోనూ అదే ఫలితాన్ని రిపీట్ చేసేందుకు చెమటోడుస్తోంది. మంగళవారం సాయంత్రమే కాన్పూర్ చేరుకున్న భారత జట్టు.. బుధవారం హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ చేసింది. తొలి టెస్టులో దారుణంగా విఫలమైన కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నెట్స్‌లో శ్రమించారు. బ్యాటింగ్ ప్రాక్టీస్‌తో పాటు క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశారు. శుక్రవారం నుంచి మ్యాచ్ మొదలవుతున్న నేపథ్యంలో పిచ్ ఎలా స్పందిస్తునే దానిపై ఉత్కంఠ నెలకొంది.

'గ్రీన్' మ్యాచ్

మ్యాచ్ జరుగనున్న గ్రీన్ పార్క్ స్టేడియంలో పర్యావరణహితంగా నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (యూపీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో ప్లాస్టిక్ ప్లేట్స్, బాటిల్స్ వినియోగం తగ్గించి పేపర్ ప్లేట్స్‌ను ప్రోత్సహించనున్నట్టు యూపీసీఏ తెలిపింది.

టాప్-10లోకి పంత్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రిషబ్ పంత్ టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో పంత్ 731 పాయింట్లతో ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో సూపర్ సెంచరీతో చెలరేగిన పంత్..తన ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకున్నాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (751) ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. మరోవైపు కెప్టెన్ రోహిత్‌శర్మ(716) ఐదు ర్యాంక్‌లు చేజార్చుకుని పదో ర్యాంక్‌కు పడిపోయాడు. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ (709)..ఐదు స్థానాలు చేజార్చుకుని 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. చెన్నై టెస్టులో అదరగొట్టిన అశ్విన్(871), బుమ్రా(854) వరుసగా టాప్-2లో ఉన్నారు.

ఒకే ఇన్నింగ్స్‌లో 498 పరుగులు

గుజరాత్ కుర్రాడి మారథాన్ ఇన్నింగ్స్

అహ్మదాబాద్: గుజరాత్ యువ క్రికెటర్ ద్రోణ దేశాయ్ ఒక ఇన్నింగ్స్‌లో 498 పరుగులు చేసి రికార్డులు బద్దలుకొట్టాడు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ క్రికెట్ అహ్మదాబాద్ నిర్వహించిన 'దివాన్ బల్లుభాయ్ కప్ అండర్-19 టోర్నీ'లో సెయింట్ జేవియర్స్ స్కూల్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ద్రోణ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏకంగా 86 బౌండరీలు, ఏడు భారీ సిక్సర్లున్నాయి. ద్రోణ రికార్డు స్కోరుతో సెయింట్ జేవియర్స్ ప్రత్యర్థి జేఎల్ ఇంగ్లీష్ స్కూల్‌పై ఏకంగా 712 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఇక రికార్డు స్కోరుతో ద్రోణ పేరు రికార్డు పుటల్లోకెక్కింది. అండర్-19 క్రికెటర్ల (భారత్)లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన వారి జాబితాలో అతడు ఆరో స్థానంలో నిలిచాడు. ప్రణవ్ ధనవడె (1009), పృథ్వీ షా (546), హవెవాలా (515), చమన్‌లాల్ (506) అర్మన్ జాఫర్ (498) ద్రోణ కంటే ముందున్నారు.

170 సర్వే నంబర్ అసైన్డ్ భూమిలో నిర్మించిన గదిని ట్రాక్టర్‌తో కూల్చివేస్తున్న అధికారులు

సామాన్యుడికో నీతి.. కాంగ్రెస్ నేతకో రీతి

- సామాన్యులది అక్రమ నిర్మాణమని కూల్చివేత
- అధికార పార్టీ నేత నిర్మాణంపై కన్నెత్తి చూడని అధికారులు?

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 25: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 'సామాన్యుడికో నీతి.. కాంగ్రెస్ నేతకో రీతి' అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణమని ఒకరిది కూల్చేసిన అధికారులు అధికార పార్టీ నేత నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి పట్టణంలోని జాతీయ రహదారికి పక్కనే గల 170 సర్వే నంబర్‌లో కొంతమంది అసైన్డ్ భూమిలో అక్రమంగా రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అక్కడికి వచ్చి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని కూల్చివేశారు. 1975లోనే అప్పటి ప్రభుత్వం తమకు పట్టా పాస్ బుక్ ఇచ్చిందని, ఇప్పటి సర్కారు దళితుల భూములను బలవంతంగా గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని షెడ్డు నిర్మించిన వ్యక్తి మోరె వెంకటయ్య వాపోయాడు. అదే 170 సర్వే నంబర్‌లో 20 గుంటల అసైన్డ్ భూమిలో ఓ అధికార పార్టీ నేత పాగావేసి ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అందులో దర్జాగా రేకుల షెడ్లు నిర్మించాడు. దళితుల నిర్మాణాలు అక్రమమైనప్పుడు, అధికార కాంగ్రెస్ నేత వేసిన రేకుల షెడ్డు అక్రమ నిర్మాణం కాదా ? అనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. 170 సర్వే నంబర్‌లో గల అసైన్డ్ భూమిలోని అక్రమ నిర్మాణాన్ని తొలగించామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మరో అక్రమ నిర్మాణంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అదే సర్వే నంబర్‌లో అధికార కాంగ్రెస్ నేత నిర్మించిన రేకుల షెడ్లు

70 ఇండ్ల కూల్చివేతకు నోటీసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో చెరువులు, కుంటలు, నాలాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించుకున్న 70మందికి నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ, నీటిపారుదలశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే ఆధారంగా నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండే ఇండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఇండ్ల యజమానులు ఇంటి నిర్మాణాలకు సంబంధించి నీటిపారుదల శాఖ ఇచ్చిన ఎన్‌వోసీ, మున్సిపల్ అనుమతుల డాక్యుమెంట్లు వారం రోజుల్లో సమర్పించాలని కోరినట్టు వెల్లడించారు.

బ్రాహ్మణ సంక్షేమం ఉన్నట్టా.. లేనట్టా?

సర్కార్‌కు కేవీ రమణాచారి సూటి ప్రశ్న • పరిషత్తును పునరుద్ధరించాలని సీఎంకు విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): పేద బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కార్యకలాపాలన్నీ స్తంభించిపోయి 'సంక్షోభ పరిషత్తు'గా మారిపోయిందని పరిషత్తు పూర్వ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ఆవేదన వ్యక్తంచేశారు. అసలు పరిషత్తు ఉన్నట్టా? లేనట్టా అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరిషత్తును పునరుద్ధరించి సంక్షోభాన్ని నివారించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే కనీసం రూ.30 కోట్లు విడుదల చేస్తే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలు కలుగుతుందని సూచించారు.

సభ్య కార్యదర్శికి నిధులు విడుదల చేసే అధికారం లేనందున ఆ అధికారం తాత్కాలికంగా దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శికి అప్పగించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు. పరిషత్తు సమస్యలపై బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని వాపోయారు. వివేకానంద విదేశీ విద్యాపథకం కింద 300 మంది విద్యార్థులు విదేశీ విద్యాసంస్థల్లో చేరగా, వారికి ఇంతవరకూ నిధులు విడుదల చేయలేదని, దీంతో వారు అక్కడ అవస్థలు పడుతున్నారని వివరించారు. వారి తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ప్రభుత్వం వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. నిరుద్యోగుల స్వయం ఉపాధికి ఉద్దేశించిన 'బెస్ట్' పథకం, పేద విద్యార్థుల ఉపకార వేతనాలను అందించే శ్రీరామానుజ పథకం, వేద పాఠశాలల అభివృద్ధి, వేదవిద్యను అభ్యసించే విద్యార్థులు, వేద శాస్త్ర పండితులు తదితరులకు అందించే ఆర్థిక సహాయం కూడా పూర్తిగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త దరఖాస్తులు ఆహ్వానించడంలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదని, బ్రాహ్మణ పరిషత్తులో నిధులు లేక చిన్నాచితకా పనులు కూడా జరగడంలేదని తెలిపారు. కార్యాలయంలో నిర్వహణ పనులు చేసే చిన్నచిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్తు ద్వారా వివిధ పథకాల అమలు కోసం ఏటా రూ.100 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు.

వినాయక చవితి @ 1,360 కోట్లు!

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా బొజ్జ గణపయ్య పండుగ అంబరాన్ని తాకింది. మార్కెట్ కళకళలాడింది. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు వేల మందికి ఉపాధి లభించింది. విగ్రహాల తయారీ, మండపాలు, అలంకరణ ఇలా ప్రతి పనిలోనూ ఉపాధి దొరికింది. ఇదే సమయంలో మార్కెట్‌లో వ్యాపారం కూడా బాగా జరిగింది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కమిటీలు ఖర్చుకు వెనుకాడలేదు. విగ్రహాల కొనుగోలు మొదలు మండపాల అలంకరణ, డీజేలు, బ్యాండ్ మేళాలు, అన్నదానాలు, శోభాయాత్రలో ప్రత్యేకత చాటేందుకు బాగానే ఖర్చు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.36 లక్షల విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు డీజీపీ జితేందర్ చెప్పారు. ఈ లెక్కనా సగటున ఒక్కో మండపానికి కనీస ఖర్చు రూ.1 లక్షగా అంచనా వేసినా రూ.1,360 కోట్లు ఖర్చు అయినట్టే.

సామూహిక సెలవుల్లో నల్లగొండ 'పంచాయతీ'లు

- నిధుల లేమి.. పని ఒత్తిడిని వ్యతిరేకిస్తున్న కార్యదర్శులు
- ఇతర విభాగాల పెత్తనాలపై ఎంపీవోల నిరసనలు
- అకారణ సస్పెన్షన్లను తప్పుపడుతున్న ఎంపీడీవోలు

తిప్పర్తి 'ఎంపీడీవో' సూపరింటెండెంట్‌కు సామూహిక సెలవు పత్రాన్ని ఇస్తున్న జీపీఎస్‌లు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/నీలగిరి: నల్లగొండ జిల్లాలో క్షేత్రస్థాయి పాలన వ్యవహారాల్లో కీలకమైన గ్రామ, మండల పరిషత్ విభాగం అధికారులు బుధవారం నుంచి సామూహికంగా సెలవుల్లోకి వెళ్లారు. 9 నెలలుగా నిధులు రాకున్నా.. సొంత ఖర్చులతో విధులు నిర్వర్తిస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి ఆయా సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో వేర్వేరుగా జాయింట్ కలెక్టర్‌కు సామూహిక సెలవుల వినతిపత్రాలను అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు విధులకు వెళ్లబోమని పంచాయతీ కార్యదర్శుల జేఏసీ స్పష్టంచేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటి నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రాలేదని, అయినా.. అప్పులు చేసి తాగునీటితో పాటు పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ చేపడుతున్నామని పేర్కొన్నారు. తమకు రావాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అకారణంగా సస్పెండ్ చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సామూహిక సెలవుల్లో వెళ్తున్నట్టు అన్ని మండలాల్లో ఎంపీడీవోలకు కార్యదర్శుల జేఏసీ లేఖలను అందజేసింది. ఇదే సమయంలో ఉన్నతాధికారులు వివిధ రకాలుగా ఒత్తిళ్లకు గురిచేస్తున్నారంటూ మండల పంచాయతీ అధికారులు సామూహిక సెలవు పెట్టారు. ఎంపీడీవో సంఘం ఆధ్వర్యంలోనూ సామూహిక సెలవు కోరుతూ కలెక్టర్‌కు లేఖ పంపించారు. దాంతో జిల్లా వ్యాప్తంగా పాలన ఆగిపోయినట్టు అయ్యింది. అప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి మూడు రోజులపాటు మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడం గమనార్హం. దీంతో సామూహిక సెలవులు పెట్టిన పంచాయతీ విభాగం అధికారులతో సంప్రదింపులు జరిపేది ఎవరు? పరిష్కారం చూపేది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది.

సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకోం

- జెన్‌కో ద్వారానే రామగుండం ప్లాంట్ నిర్మించాలి: టీఎస్‌పీఈ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని తాము అస్సలు ఒప్పుకోబోమని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రకటించింది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దశలవారీగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని వివరించింది. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3 వరకు జెన్‌కో సహా అన్ని విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో గేట్ మీటింగ్స్, అక్టోబర్ 4, 5 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో అన్ని విద్యుత్తు కార్యాలయాల ఎదుట నిరసన తెలపాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు మింట్ కంపౌండ్‌లోని 1104 కార్యాలయంలో జేఏసీ నేతలు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ రామగుండంలో 800 మోగావాట్ల విద్యుత్తు ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ స్థలం జెన్‌కోకు చెందినదని, కాబట్టి జెన్‌కో ద్వారానే ప్లాంటు నిర్మించాలని, జాయింట్ వెంచర్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. అక్టోబర్ 5 వరకు దశలవారీగా ఆందోళనలకు దిగుతామని, అయినా ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే అక్టోబర్ 5 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

28న లోక్ అదాలత్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైకోర్టుతోపాటు రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 28న లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రత్యక్షంగానే కాకుండా ఆన్‌లైన్‌లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కక్షిదారులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని కోరారు.

అక్టోబర్ 21 నుంచి ఎస్‌ఏ -1 ఎగ్జామ్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 1-10వ తరగతి విద్యార్థులకు అక్టోబర్ 21 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1(ఎస్ఏ) పరీక్షలు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. అక్టోబర్ 21 నుంచి 28 వరకు పరీక్షలు నిర్వహించనుండగా, నవంబర్ 5లోగా మార్కులను అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు.

30 వరకు ఎన్‌ఎంఎంఎస్‌కు గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తుల గడువును ఈ నెల 30వరకు పొడిగించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

28న 'నాన్ గెజిటెడ్' సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): భూగర్భ జల శాఖలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 28న రెండో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఉదయం 10:30 నుంచి నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థుల జాబితాను https://www.tspsc.gov.in లో పొందుపరిచామని తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.